సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం : 25 : జనవరి : 2023



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంతం బోనాల భక్తుల రద్దీతో కిటకిటలాడింది.



ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్: జేఈఈ మెయిన్స్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో తొలిరోజు పరీక్షకు 85 శాతం విద్యార్థులు హాజరయ్యారు.

గరిష్టం/కనిష్టం

31.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. రాత్రిపూట ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు



గ్రామ పంచాయతీ కార్యాలయం

వేములవాడరూరల్: జిల్లాలోని 11మండలాల్లో 79 గ్రామ పంచాయతీలకు నూతన భవన నిర్మాణాల కోసం తెలంగాణ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయ్యాయి. ఒక్కో గ్రామ పంచాయతీకి దాదాపు రూ.20లక్షల నిధులు ఈజీఎస్ నుంచి మంజూరు చేసినట్లు వేములవాడ జెడ్పీటీసీ ఏశ వాణి తెలిపారు. జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలకు ఒకేవిధంగా భవన నిర్మాణం చేపట్టేలా ఈ నిధులను మంజూరు చేశారు. జిల్లా అధికారులు ఈ నెలలోనే గ్రామ పంచాయతీల భవన నిర్మాణం చేయడానికి తీర్మాణం చేయనున్నట్లు తెలిసింది.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

బోయినపల్లి(చొప్పదండి): ప్రజలు కంటి వెలుగు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని బోయినపల్లి, విలాసాగర్, కొదురుపాక గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంతమందికి కంటి పరీక్షలు చేశారు..? ఎంత మందికి అద్దాలు అందించారు..? తదితర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు రేణుక, అనిత, రేణుప్రియాంక, సూపర్‌వైజర్ శశికుమార్, తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ సిరిసిల్ల స్ఫూర్తిని చాటుదాం



కార్యక్రమంలో చైర్‌పర్సన్ కళ, కమిషనర్

సిరిసిల్లటౌన్: స్వచ్ఛతలో సిరిసిల్ల పట్టణం స్ఫూర్తిని ఈ ఏడాది కూడా చాటుదామని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్– 2023లో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం మూడో వార్డులో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. జిందం కళ మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంలో బల్దియా వరుసగా జాతీయ స్థాయిలో అవార్డులు సాధిస్తోందని అన్నారు. ప్రజలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరంలో 37 మందికి పరీక్షలు



సదరం శిబిరానికి హాజరైన దివ్యాంగులు

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం సదరం శిబిరాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 37 మంది దివ్యాంగులు వైకల్య పరీక్షల కోసం మీ సేవ కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకుని శిబిరానికి వచ్చారు. వీరికి ఆర్థోపెడిక్ డాక్టర్ వి.అనిల్‌కుమార్ వైకల్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ మురళీధర్‌రావు, ఆర్‌ఎంవో డాక్టర్ పత్తిపాక రఘు, ఏపీవో ఏ.పాపారావు, టైపిస్ట్ ఎస్.వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు. సదరం సర్టిఫికేట్ జారీ విషయంలో ఎటువంటి దళారులను నమ్మవద్దని, ఎవరికి డబ్బులు ఇవ్వద్దని ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు కోరారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ


గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ఆ అమెరికా వారు మంగళవారం విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పిట్ల దాసు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీవల్లి, సీనియర్ అధ్యాపకులు కృష్ణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం..









సిరిసిల్లకల్చరల్: పద్మశాలీలు ఇలవేల్పుగా భావించే మహర్షి మార్కండేయుడి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మార్కండేయ ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. మార్కండేయ మహాయాగం, పూర్ణాహుతి జరిపిన అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు. బూట్ల నవీన్ దంపతులు యాగ దంపతులుగా వ్యవహరించారు. సాయంత్రం నిర్వహించిన శోభాయాత్ర పద్మశాలీల ఐక్యతకు చిహ్నమై నిలిచింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మార్కండేయస్వామిని ఊరేగించారు. పాత బస్టాండ్‌లో ఉన్న చేనేత విగ్రహానికి నేతలు పూలమాలలు వేశారు. ఆలయం నుంచి ప్రారంభమైన యాత్ర, గాంధీ సర్కిల్, అంబేడ్కర్ చౌక్, పాతబస్టాండ్, పెద్దబజార్, శ్రీ వేంకటేశ్వరఆలయం, గాంధీచౌక్ మీదుగా తిరిగి ఆలయ ప్రవేశంతో ముగిసింది. విద్యార్థులు, మహిళలు నిర్వహించిన కోలాటం,నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహిళా కౌన్సిలర్ల దాండియా ఆటలు అలరించాయి. దేవతా మూర్తుల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర పవర్‌లూమ్, టెక్స్‌టైల్ అభివృద్ధి చైర్మన్ గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, ఎస్పీ రాహుల్ హెగ్డే, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, కమిషనర్ సమ్మయ్య, టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చీటి నర్సింగరావు, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, పద్మశాలి సంఘం పట్టణాధ్యక్షుడు గోలి వెంకటరమణ, కార్యదర్శి మండల సత్యం, పెద్దసంఖ్యలో పద్మశాలీ కులస్తులు పాల్గొన్నారు.

ఆటాడేస్తున్నారు..!

పాపం శ్రీనివాస్..



- ఆకుల శ్రీనివాస్, సోదరుడు తిరుపతి కలిసి 6 సంవత్సరాల క్రితం వేములవాడ మండలం వెంకటాంపల్లిలోని 26, 36, 39, 41, 42, 43, 44 సర్వేనంబర్లలో గల సాగు భూమిని రిజిస్ట్రేషన్ దస్తావేజు ద్వారా కొనుగోలు చేశారు. ధరణి రాక ముందు జరగగా మ్యుటేషన్ చేయడంలో ఆలస్యం అయింది. అంతలోనే ధరణి వచ్చి చేరింది. దీంతో ధరణిలో మ్యుటేషన్ చేయాల్సిన రెవెన్యూ అధికారులు శ్రీనివాస్‌ను బంతాట ఆడుతున్నారు. ఒక్కోసారి ఒక్కో కొర్రీ పెడుతూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ముందు కాలువ కింద భూమి పోకున్నా.. పోయిందని ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చారు. తరువాత రుణమాఫీ అయినప్పటికీ బ్యాంక్ లోన్ ఉందని నెలల తరబడి తిప్పుకున్నారు. సాక్షి కథనం క్రమంలో రెండు, మూడు సర్వే నంబర్లను పరిష్కరించగా మళ్లీ అదే పరిస్థితి. 36, 39, 41 ఇతర సర్వేనంబర్లలోని బై నంబర్లలో కొన్నింటికి డిజిటల్ సైన్ చేయగా మరికొన్ని నాలా అంటూ, ప్రొహిబిటేడ్ అంటూ పేర్కొనడం విడ్డూరం. తీరా కలెక్టర్ చేతిలో ఉందని చేతులెత్తేశారు. ఫలితంగా ఆరేళ్లుగా రైతుబంధు అందకపోగా ఇతర ప్రయోజనాలు పొందడం లేదు.

ఎవరి తప్పు..




- ఈ రైతు పేరు కస్తూరి కీర్తికుమార్. కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు గ్రామం. గ్రామంలోని 924/ఆ/2/1లో వారసత్వంగా 12 గుంటలు నమోదు కావాల్సి ఉండగా కేవలం 2 గుంటలు మాత్రమే నమోదైంది. ఇదెక్కడి అన్యాయమని రెవెన్యూ అధికారులను కలిస్తే ఉపశమన మాటలే తప్ప పరిష్కరించలేదు. మీసేవలో చేసిన దరఖాస్తులో తప్పు ల వల్లే తప్పుగా నమోదైందని అధి కారులు చెబుతుండటం విశేషం. ఇవి కేవలం వీరిద్దరి సమస్యనుకుంటే పొరపాటే. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేల మంది రైతుల గోస.

- తప్పు చేసేదివారే.. నిర్లక్ష్యం వారిదే..
- భూ రికార్డుల నిర్వహణలో ఇష్టారాజ్యం
- వేలమంది రైతుబంధుకు దూరం
- అప్పులిచ్చేందుకు బ్యాంకుల నిరాకరణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'ఎవరో జ్వాలను రగిలించారు.. వేరెవరో దానికి బలి అయ్యారు' అన్న పదాలకు ధరణి పోర్టల్ సమస్యలు సరిగ్గా సరిపోతాయి. భూముల విషయంలో పారదర్శకత తీసుకువస్తామని చెప్పి.. అమలులోకి తీసుకు వచ్చిన ధరణి పోర్టల్‌లో పాత సమస్యలు పరిష్కరించకపోగా కొత్త సమస్యలు సృష్టిస్తూ రైతులను ముప్పతిప్పలు పెడుతోంది. చిన్న పొరపాట్లు, అక్షరదోషాలు, తప్పుల సవరణ చేసేందుకు సైతం అధికారులు బాధితులను నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ఈ క్రమంలో సామాన్యులు.. అందులోనూ రైతులు నానా ఇబ్బందుల పడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వపరంగా అందాల్సిన రైతుబంధు వీరికి అందని ద్రాక్షగా మారింది. సవరణలు చేయాలని కాళ్లరిగేలా తిరిగినా.. కనికరించే నాథుడు లేకుండా పోవడం అత్యంత బాధాకరం.

- ప్రభుత్వం భూ సమస్యల్లేకుండా దిద్దుబాటు చర్యలు చేపడుతుండగా అధికార యంత్రాంగ నిర్లక్ష్యం గుదిబండలా మారింది. కాలువ కింద భూమి పోకున్నా పోయిందని, నాలా భూమని, బ్యాంకు లోన్ ఉందంటూ తిర 'కాసులు' పెడుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం వీరికే చెల్లు. నెలలు కాదు ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారంటే విధుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సర్వే నంబర్ సమస్యలో ఉంటే సరే అందులోని బై నంబర్లు సరిగా ఉండటం, మరిన్ని సమస్యల్లో ఉంచడం దేనికి సంకేతం. పలువురు కలెక్టర్లు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై కొరడా ఝుళిపిస్తుండగా పలువురు కలెక్టర్లు పట్టనట్లు వ్యవహరించడం విడ్డూరం. ప్రతీ కుటుంబంపై కలెక్టర్‌కు అవగాహన ఉండాలని, సమస్యల్లేకుండా పాలన ఉండాలనే జిల్లాల విభజన చేసినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించగా క్షేత్రస్థాయిలో పరిస్థితి విరుద్ధం.



ధరణి పేరిట కాలయాపన.. ప్రజావాణిలో అత్యధికం ఇవే

రెవెన్యూ అధికారులు మామూలుగా పరిష్కరించే సమస్యలను కూడా ధరణితో ముడిపెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో ఈ తరహా కేసులు ఉండటం ఆశ్చర్యపరుస్తోంది. జగిత్యాల జిల్లాలో 8,174 దరఖాస్తులు రాగా ఇందులో తిరస్కరించినవి 2,685. అంగీకరించినవి 5,489. అంటే 426 రోజుల్లో రోజుకు 12 అర్జీలు వచ్చినట్లు అధికారికంగా ఇచ్చిన సమాచారంతో స్పష్టమవుతోంది. ఈ లెక్కన రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో మరో 15 వేల వరకు ధరణి దరఖాస్తులుంటాయని స్పష్టమవుతోంది. ఇక ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల్లో అత్యధికం ఇవే ఉండటం అధికారుల పనితీరుకు నిదర్శనం. ప్రతీ సోమవారం కలెక్టరేట్లలో ప్రజావాణి జరుగుతుండగా సుమారు 200 వరకు అర్జీలొస్తున్నాయి. ఇందులో 70–90వరకు ఇవే అర్జీలున్నాయంటే పరిస్థితి తీవ్రతను చాటుతోంది.

మార్పులకు అవకాశంలోనూ నిర్లక్ష్యం..!

రాష్ట్ర ప్రభుత్వం ధరణిలో పలు ఆప్షన్లకు అవకాశమిచ్చింది. అయినా.. అధికారుల వల్లమాలిన నిర్లక్ష్యం రైతులకు శాపమవుతోంది. పట్టాదారు పాసు పుస్తకంలో అక్షర దోషాలు ఉన్నా పొరబాటున వేరే పేరు పడినా సరి చేసుకోవచ్చు. మహిళకు బదులు పురుషుడు, పురుషుడికి బదులు మహిళ అని అచ్చు తప్పు దొర్లినా, రిజర్వేషన్ కేటగిరీ తప్పుగా నమోదైనా, ఆధార్ నంబర్ తప్పుగా నమోదైనా సరిచేసుకోవచ్చు.

- అలాగే పట్టా, సీలింగ్, భూదాన్, అసైన్డ్ వంటివి తప్పుగా నమోదైతే మార్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- భూమి ఏ విధంగా సంక్రమించిందనే వివరాల్లో తప్పులుంటే మార్చుకునే వీలుంది.
- వాస్తవ భూమి కంటే పాస్ పుస్తకంలో తక్కువగా నమోదైతే మార్చుకునే వీలుంది. దీంతో ఎక్కువ.. తక్కువ సమస్యలు తొలగుతాయి.
- భూమి వర్గీకరణ మాగాణి, తరి, మెట్ట వంటి వివరాల మార్పిడి చేసుకోవచ్చు.
- వారసత్వం, అన్న, తమ్ముడు, సొంతం, కుమారుడు వంటివి మార్చుకునే అవకాశముండగా ఏదైనా సర్వే నంబర్ లేదా సబ్ డివిజన్ నంబర్ కనిపించకపోవడం, ఆ మేరకు విస్తీర్ణం తక్కువగా నమోదైతే మార్చుకునే అవకాశముంది. దీనికి సంబంధించిన సర్వే నంబర్లను ఎంచుకోవచ్చు.
- ఏదైనా కారణంతో భూమి 1బీ ఖాతాలో చేరి ఆ తర్వాత పరిష్కారమైతే వాటిని పట్టా నమోదుకు అవకాశం ఇచ్చారు. కానీ సదరు అర్జీల్లోనూ నిర్లక్ష్యం చేస్తున్నారని ఉమ్మడి జిల్లా రైతులు వాపోతున్నారు.

సమస్యలు ఎన్నెన్నో..!

ఎకరాన రూ.20 లక్షలు పలికినా భూముల ధరలు నేడు కోటికి చేరడంతో అత్యంత విలువైందిగా మారింది. దీంతో భూ వివాదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఎప్పటికప్పుడు సమస్యల్లేకుండా చొరవ తీసుకోవాల్సిన యంత్రాంగం నత్త నడకన వ్యవహరించడం దారుణ పరిణామం. ఒకరి భూమి ఒకరి పేరున నమోదవడంతో వీటిని తిరిగి పొందేందుకు ఆప్షన్లు సైతం లేకుండా పోయాయి. నాలుగైదు దశాబ్దాల కిందట భూములు అమ్ముకున్నవారు సైతం ధరణిలో రెవెన్యూ అధికారుల తప్పిదాల కారణంగా వారి పేర్లు రావడంతో భూములు అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏళ్లతరబడి సాగుచేసుకుంటుండగా వంశపారంపర్యంగా వచ్చిన భూములు ఇతరుల పేర్లపై ధరణిలో నమోదయ్యాయి. పక్కాగా ఉన్న పట్టా భూములు సైతం నిషేధిత జాబితాలో చేరాయి. దీంతో రైతులు పంట రుణాలు పొందలేని దుస్థితి ఏర్పడింది. చాలా సర్వే నంబర్లు మిస్ అయ్యాయి. ఏళ్లుగా రైతుబంధుకు దూరమవుతున్నారు.

తప్పనున్న ట్రాఫిక్ తిప్పలు

- రగుడు–వెంకటాపూర్ మధ్య ఫోర్‌లేన్ రోడ్డు సిద్ధం
- రూ.95కోట్లతో 11 కిలోమీటర్ల రహదారి రెడీ



వెంకటాపూర్- రగుడు మధ్య ఫోర్‌లేన్

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రానికి మరో ఫోర్‌లేన్ రహదారి దరి చేరుతోంది. కరీంనగర్– కామారెడ్డి రోడ్డు సిరిసిల్ల పట్టణ నడిబొడ్డు నుంచి వెళ్తుండగా.. సిరిసిల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువయ్యాయి. సిరిసిల్ల పట్టణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసేందుకు కలెక్టరేట్ సర్కిల్ రగుడు నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు 11 కిలోమీటర్లు ఫోర్‌లేన్ (నాలుగు వరుసల) రహదారిని రూ.95 కోట్లతో నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. పెద్దూరు శివారులో నాలుగు వరుసల రోడ్డు ఫైనల్ లేయర్ బీటీ (తారు)ని వేస్తున్నారు. గత ఐదేళ్లుగా అనేక అవాంతరాల మధ్య మధ్యలో ఆగిన ఈ రోడ్డు ఎట్టకేలకు పూర్తి అవుతుంది. ఫోర్‌లేన్ రహదారి సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌తో, డివైడర్‌తో చేపట్టారు. త్వరలోనే వాహనదారులకు ఈ రోడ్డు అందుబాటులోకి రానుంది.

4,228 మందికి కంటిపరీక్షలు



కంటి పరీక్షలు చేయించుకుంటున్న పోలీస్ ఆఫీసర్

సిరిసిల్ల: జిల్లాలో కంటి వెలుగు పరీక్షలు క్షేత్రస్థాయిలో కొనసాగుతున్నాయి. 26 కేంద్రాల్లో మంగళవారం 4,228 మందికి పరీక్షలు చేశారు. ఇందులో 932 మందికి రీడింగ్ అద్దాలు అందించారు. 921 మందికి పాయింట్ అద్దాలు పంపిణీ చేశారు. 234 మంది సిబ్బంది కంటి వెలుగులో భాగస్వాములు అయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 15,157 మందికి కంటి పరీక్షలు చేశారు.

ఆలయాల్లో పవన్ పూజలు

- కొండగట్టు అంజన్న సన్నిధిలో పవన్ కల్యాణ్
- వారాహి ప్రచార రథానికి ప్రత్యేక పూజలు
- కార్యకర్తలతో సమావేశమైన జన సేన అధినేత
- ధర్మపురి నృసింహుని సన్నిధిలో 'అనుష్టుప్' యాత్ర షురూ



కొండగట్టులో అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్

మల్యాల/కొడిమ్యాల(చొప్పదండి)/ధర్మపురి: జన సేన అధినేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ కొండగట్టు శ్రీఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఆయనను చూసేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన వేలాది మంది యువత, అభిమానులు తరలివచ్చారు. తొలుత కొండగట్టు అంజన్న ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. త తర్వాత పవన్ కల్యాణ్ శ్రీఆంజనేయస్వామికి శేష వస్త్రాలు, తమలపాకులు, పండ్లు సమర్పించారు. మూలవిరాట్టుకు అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జితేంద్రస్వామి, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, అఖిల్ కృష్ణ, రామ్, లక్ష్మణ్.. పవన్ కల్యాణ్‌కు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం జనసేన ప్రచార రథం వారాహి వాహనానికి పూజలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ రాక సందర్భంగా అంజన్న సన్నిధిలో దర్శనం నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వారాహి పూజ అనంతరం ఆ వాహనంపైకి ఎక్కిన పవన్ కల్యాణ్ అభిమానులకు అభివాదం చేశారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి జన సేన పనిచేస్తుందని అన్నారు. ఆ తర్వాత 'జై తెలంగాణ' అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. మరోవైపు.. నాచుపల్లిలోని బృందావన్ రిసార్ట్స్ వద్ద కార్యకర్తలతో సమావేశమైన పవన్ కల్యాణ్‌ను చూసేందుకు వందలాది మంది అభిమానులు తరలివెళ్లారు. లోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా, వారిని వారించేందుకు పోలీసులు లాఠీచార్జీ చేశారు. తమ పార్టీ నాయకులను లోనికి ఎందుకు అనుమతించడంలేదని జన సేన పార్టీ నాయకుడు దయాకర్.. రిజర్వ్ సీఐని దుర్భాషలాడారు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ధర్మపురి నృసింహుని సన్నిధిలో..

సాయంత్రం 6.30గంటలకు ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధికి చేరుకున్న పవన్ కల్యాణ్ వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు.ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి శేషవస్త్రం కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పవన్ రాక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో పట్టణాన్ని అష్టదిగ్బంధం చేశారు. భారీసంఖ్యలో తరలివచ్చిన అభిమానులను అదుపు చేయడానికి పోలీసులకు సాధ్యం కాలేదు. కేవలం దేవస్థానం సిబ్బంది, కౌన్సిలర్లను అనుమతిచ్చారు.

ఇసుక ట్రాక్టర్లకు జీపీఎస్

- స్వచ్ఛ పల్లెలను తీర్చిదిద్దాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్ల పరిశీలన

సిరిసిల్ల: జిల్లాలో ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లకు జీపీఎస్ అనుసంధానం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వెంకటాపూర్, ఆవునూర్, మల్లారం, మామిడిపల్లి, బావుసాయిపేట, కనగర్తి శివారుల్లో స్థానిక అవసరాలకు ఇసుకను అనుమతించాలని, అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ.. వే బిల్లులు జారీ చేయాలన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, మైనింగ్ ఏడీ సైదులు, డీపీవో రవీందర్, టీఎస్‌ఎండీసీ ప్రాజెక్టు అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, భూగర్భ జల అధికారి నర్సింహులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దాలి

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్– 2023లో భాగంగా పల్లెల్లో వాల్ పెయింటింగ్ వేయించాలని, ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఊరిలో మురికి కాల్వకు ఎండ్ పాయింట్‌లో ఇంకుడు గుంత ఉండాలన్నారు. ప్లాస్టిక్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ చేయాలన్నారు. గ్రామ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలు పని చేయాలన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అనురాగ్ జయంతి

రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్ల పరిశీలన

కలెక్టరేట్‌లో జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి పరిశీలించారు. జెండా ఆవిష్కరణ, పోలీస్ గౌరవ వందనం ఏర్పాట్లపై చర్చించారు.

నవజాత శిశువులకు ప్రత్యేక వార్డు

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిలో మరిన్ని వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. ఆస్పత్రిని మంగళవారం సందర్శించారు. వేములవాడ ఏరియా ఆస్పత్రికి డీఈఐసీతో పాటు ఐదు పడకల సామర్థ్యం ఉన్న డయాలసిస్ సెంటర్ మంజూరు అయిందని అన్నారు. ఈ సెంటర్‌లో ఇద్దరు వైద్యులతో పాటు పదిమంది సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఐదు పడకల సామర్థ్యంలో డయాలసిస్ కేంద్రం మంజూరైందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, డాక్టర్ మహేశ్‌రావు ఉన్నారు.

క్లుప్తంగా

పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ



అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

సిరిసిల్లటౌన్: పోస్టల్ శాఖలో చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ లభిస్తుందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో చిన్నమొత్తాల సంస్థ ద్వారా చేసే సుకన్య, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, నేషనల్ సేవింగ్స్ స్కీమ్స్, నెలవారీ ఆదాయం స్కీం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్, కేవీపీ, సీనియర్ సిటిజన్స్ స్కీం, రికరింగ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు, వాటితో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని కోరారు. ఆయన వెంట పోస్టల్ సిబ్బంది తదితరులున్నారు.

'పోస్టాఫీసు పొదుపు వడ్డీ రేట్లు పెంచాం'

వేములవాడ: పోస్టాఫీసు పొదుపు వడ్డీ రేట్లను భారీగా పెంచినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ రేట్లను సవరించామన్నారు. చిన్న మొత్తాల పొదుపు ద్వారా సుకన్య, ఫిక్స్ డ్ బాండ్స్, నేషనల్ సేవింగ్స్ స్కీం, మంత్లీ స్కీం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, కిసాన్ వికాస్ పత్ర, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం, రికరింగ్ డిపాజిట్‌లలో వడ్డీ రేటు పెంచినట్లు పేర్కొన్నారు. పోస్టల్‌శాఖ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైద్యశాఖలో ఉద్యోగ అవకాశాలు

సిరిసిల్ల: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో 9 పోస్టుల భర్తీకి కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు జారీ చేశారని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల వైద్యులు, మెడికల్ ఆఫీసర్, ఆడియోలజిస్ట్, సైకాలజిస్ట్, అఫ్తోమెట్రిస్ట్, ఎర్లీ ఇంటర్వేషన్ కం స్పెషల్ ఎడ్యుకేటర్, సోషల్ వర్కర్, డెంటల్ టెక్నీషియన్, డీఈఐసీ మేనేజర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్హతలు ఉన్నవారు పూర్తి బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు డీఎంహెచ్‌వో పేరిట రూ.500 డీడీని జత చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా వెబ్‌సైట్ www.rajannasiricilla.gov.in చూడాలని పేర్కొన్నారు.

సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి



గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జీడీకే–2ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రూ.25 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో జీతాలు చెల్లించలేని స్థితికి సింగరేణి చేరుకుందన్నారు. సంస్థలో శరవేగంగా సాగుతున్న కాంట్రాక్టీకరణ, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 11వ వేతన ఒప్పందం ఖరారులో బీఎంఎస్ కీలకపాత్ర పోషించిందన్నారు. నాయకులు సారంగపాణి, మాదాసి రవీందర్, స్వామి, సాంబయ్య, రాజేశం, నారాయణ, శ్రీకాంత్, కోటయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీ.. నెరవేరదేమీ?

- మిడ్‌మానేరు నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి రూ.5.04 లక్షలిస్తామని ప్రకటన
- కొందరికి అందని పరిహారం, ఇళ్ల పట్టాలు
- దరఖాస్తులు స్వీకరించి, 3 నెలలైనా స్పందన లేదని బాధితుల ఆవేదన



రుద్రవరంలో నిర్వాసితుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు (ఫైల్)

వేములవాడ అర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మాన్వాడ వద్ద నిర్మించిన మిడ్‌మానేరు ప్రాజెక్టులో కొదురుపాక, నీలోజిపల్లి, శభాష్‌పల్లి, వర్దవెల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, చింతల్‌ఠాణా, చీర్లవంచ, కందికట్కూర్, గుర్రవానిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008లో గెజిట్ విడుదల చేసి, ఆయా పల్లెల్లో 11,750 కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయని అధికారులు గుర్తించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు ఏర్పాటు చేసి, ఒక్కో కుటుంబానికి రెండు గుంటల స్థలం కేటాయించి, పాత ఇళ్ల, భూములకు సంబంధించి నపరిహారం,కాలనీల్లో ఇళ్ల పట్టాలు అందించారు.

పరిహారం అందక పలువురి ఆవేదన

గతంలో జాబితాలో పేర్లు, వృత్తి, ఇంటి పరిహారం, పట్టాలు రాని పలువురు నిర్వాసితులు ఉండటంతో తమకు న్యాయం చేయాలంటూ వారు పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగారు. దీంతో మూడు నెలల క్రితం కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలతో ప్రతీ గ్రామానికి ప్రత్యేక అధికారులను నియమించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు గ్రామసభలు నిర్వహించి, నిర్వాసితుల సమస్యలు తెలుసుకొని, దరఖాస్తులు స్వీకరించారు. కానీ ఇప్పటివరకు వాటిపై ఎలాంటి స్పందన లేదని బాధితులు ఆవేదన చేస్తున్నారు.

నెరవేరని సీఎం కేసీఆర్ హామీ..

మిడ్‌మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఒక్కొక్కరికి ఇంటి నిర్మాణం కోసం రూ.5.04 లక్షలు ఇస్తామని 2015 జూన్ 18న వేములవాడకు వచ్చిన సందర్భంగా సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు అది నెరవేరలేదని నిర్వాసితులు వాపోతున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు, బాధితులు సిరిసిల్ల–కరీంనగర్ రహదారిపై పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టినా ఫలితం లేకపోయిందని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

రూ.5.04 లక్షలివ్వాలి



సీఎం కేసీఆర్ 2015లో వేములవాడకు వచ్చిన సందర్భంగా ప్రతీ నిర్వాసితుడికి ఇంటి నిర్మాణం కోసం రూ.5.04 లక్షలిస్తామని ప్రకటించారు. ఆ మొత్తాన్ని వెంటనే అందించాలి.
– కాసర్ల అరుణ్‌కుమార్, నిర్వాసితుడు, రుద్రవరం

ఇల్లు నిర్మించుకోలేదు



రుద్రవరం పాత గ్రామంలోని మా ఇల్లు ముంపునకు గురైంది. ఇప్పటివరకు పరిహారం రాలేదు. దీంతో ఇల్లు నిర్మించుకోలేదు. అధికారులు స్పందించి, పరిహారం అందేలా చూడాలి.
– మంద పర్శరాం, నిర్వాసితుడు, రుద్రవరం

న్యాయం జరిగేలా చూస్తాం



3 నెలల క్రితం గ్రామాల్లో నిర్వాసితుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించాం. వాటిని పరిశీలిస్తున్నాం. వీరిలో అర్హులను గుర్తించి, న్యాయం జరిగేలా చూస్తాం.
– రాజు, తహసీల్దార్, వేములవాడ

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లిస్తాం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లిస్తామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లి, తిమ్మాపూర్, సింగారం గ్రామాల్లో లబ్ధిదారులతో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 11 గ్రామాలను ఎంపిక చేసి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి, ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మొదటి విడతలో 6 గ్రామాలను ఎంపిక చేసి, 170 మందిని అర్హులుగా గుర్తించి, ప్రభుత్వ స్థలాలను పరిశీలించామని పేర్కొన్నారు. రూ.5 లక్షల వ్యయంతో ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ వరస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ జయంత్‌కుమార్, సర్పంచులు కొత్తపల్లి వాణి, నర్సాగౌడ్, రవీందర్, ఎంపీటీసీ సభ్యులు పద్మ, మధు, బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

- ఇద్దరు అరెస్ట్.. పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రూపేశ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రూపేశ్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి క్రాస్ రోడ్ ప్రాంతంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరు యువకులను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ రూపేశ్ తెలిపారు. పెద్దపల్లి ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన షేక్ నాగుర్ పాషా, సయ్యద్‌నబీ కాలనీకి చెందిన ఎండీ.మహబూబ్ చీకురాయి రోడ్‌లో గంజాయి అమ్ముతున్నారనే పక్కా సమాచారంతో వెళ్లి వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. గంజాయికి బానిసలైన ఇరువురు యువకులు సుభాష్‌నగర్‌కే చెందిన అయిలాపురం రఘుపతి నుంచి 800 గ్రాముల గంజాయిని కొని డబ్బు సంపాదించాలనే ఆలోచనతో చిన్న పాకెట్లుగా మార్చి అమ్మేందుకు నిర్ణయించుకున్నారని విచారణలో చెప్పారని పేర్కొన్నారు. వీరిద్దరికి గంజాయి ఇచ్చిన రఘుపతి పరారీలో ఉన్నాడని తెలిపారు. గంజాయి నిందితులను పట్టుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో ఏసీపీ సారంగపాణి, సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై రాజేశ్ ఉన్నారు.

ఓదెల పీఆర్ ఏఈ సస్పెన్షన్

పెద్దపల్లిరూరల్: ఓదెల మండల పీఆర్ ఏఈ సమ్మిరెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సంగీత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మన ఊరు.. మనబడి పనుల్లో కలెక్టర్ సహా.. ఉన్నతాధికారులు పలుమార్లు సూచనలు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లుల చెల్లింపు, ఎంబీ రికార్డు నమోదు సకాలంలో పూర్తి చేయని కారణంగా సమ్మిరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు.

వీర్నపల్లి వైస్ ఎంపీపీ భర్త మృతి

- గుండెపోటు రావడంతో అనంతలోకాలకు..
- బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్న మంత్రి కేటీఆర్



దేవేందర్ (ఫైల్)



నివాళి అర్పిస్తున్న ఆగయ్య

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల వైస్ ఎంపీపీ ఈసంపల్లి హేమ భర్త దేవేందర్ అలియాస్ వీరప్పన్(38) గుండెపోటుతో మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పదేళ్ల వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన దేవేందర్ తన నానమ్మ, తాతయ్యల వద్ద పెరిగారు. సీపీఐ ఎంఎల్ జనశక్తి, పీపుల్స్‌వార్ ఉద్యమాలు ఉధృతంగా సాగుతున్న సమయంలో ఆకర్షితుడైన ఆయన కొన్నేళ్లు పీపుల్స్‌వార్‌లో పని చేశాడు. అనంతరం సీపీఐ ఎంఎల్ జనశక్తి రాజన్న వర్గంలో దళ సభ్యుడిగా కొనసాగారు. పార్టీలో చేస్తున్న పనులను చూసి దేవేందర్‌ను వీరప్పన్‌గా పిలిచేవారు. అప్పటి ఎస్పీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒత్తిడి చేయడంతో లొంగిపోయి, గర్జనపల్లిలో సాధారణ జీవనం సాగించారు. కొన్ని సంవత్సరాలకు తన మేనమామ కూతురు హేమను వివాహం చేసుకొని, కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన తన భార్యకు వీర్నపల్లి వైస్ ఎంపీపీ పదవి దక్కించుకున్నారు. కాగా దేవేందర్‌ను పెంచి పెద్ద చేసిన నానమ్మ లచ్చవ్వ గుండెపోటుతో గత శనివారమే చనిపోయింది. సోమవారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. దేవేందర్ మృతదేహానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు మంగళవారం నివాళి అర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించగా గ్రామస్తులు తరలివచ్చారు. కాగా దేవేందర్ కుటుంబాన్ని ఆదుకుంటామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, జెడ్పీటీసీ సభ్యురాలు గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల తదితరులు పాల్గొన్నారు.

సౌదీ అరేబియాలో కథలాపూర్‌వాసి..

- 14 ఏళ్ల క్రితం వెళ్లి.. ఇంటికి వద్దామనుకుంటుండగా గుండెపోటు



నర్సయ్య (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండల కేంద్రానికి చెందిన కుమ్మరి నర్సయ్య(55) సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నర్సయ్య ఉపాధి నిమిత్తం 14 ఏళ్ల క్రితం సౌదీ వెళ్లాడు. అక్కడ సరిగా పని లేకపోవడంతోపాటు తప్పిపోయాడు. రకరకాల పనులు చేస్తుండేవాడు. స్వగ్రామం వెళ్లి, కుటుంబసభ్యులను చూడాలని ఇటీవల అక్కడే పలువురిని సంప్రదించాడు. ఈ నెల 24న ఇంటికి వచ్చేందుకు టికెట్ బుక్ చేయించుకున్నాడు. ఇంతలో సోమవారం గుండెపోటు రావడంతో అక్కడి మిత్రులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి తర్వాత మృతిచెందాడు. మృతుడికి భార్య బుజ్జి, కుమారుడు జానీ ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామం రప్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని మృతుడి కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

రౌడీషీటర్ హత్య కేసులో నలుగురి అరెస్టు

- భూవివాదం, గత నెల జరిగిన మర్డర్ విషయంలో అనుమానంతోనే ఘాతుకం
- నాలుగు సెల్‌ఫోన్లు, కత్తి, బైక్ స్వాధీనం
- నిందితులను రెచ్చగొట్టిన వారిని బైండోవర్ చేస్తాం : డీఎస్పీ నాగేంద్రచారి



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

చందుర్తి(వేములవాడ): మండలంలోని జోగాపూర్‌కు చెందిన రౌడీషీటర్ గొల్లపల్లి శంకరయ్య హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. సంబంధిత వివరాలను చందుర్తి సర్కిల్ కార్యాలయంలో ఆయన వెల్లడించారు. జోగాపూర్‌కే చెందిన గొల్లపల్లి మధుసాగర్ కుటుంబానికి శంకరయ్యకు మధ్య భూవివాదం ఉంది. పలుమార్లు పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలో గత నెలలో మధుసాగర్ తల్లి లింగవ్వ హత్యకు గురైంది. ఈ ఘటనతో శంకరయ్యకు సంబంధం ఉందని అతను అనుమానించాడు. దీనికి తన బావ చర్లపల్లి ఉరఫ్ బోనాల మహేశ్, పలువురు రెచ్చగొట్టేలా మాట్లాడిన మాటలు తోడయ్యాయి.

హత్యకు ప్లాన్..

మధుసాగర్, మహేశ్, అతని అనుచరులు మహేందర్, చర్లపల్లి రాకేశ్‌లు శంకరయ్యను హత్య చేయాలని ప్లాన్ వేశారు. ఈ నెల 21న రాత్రి 7 గంటలకు ఆయన కిరాణ దుకాణానికి వస్తున్నాడన్న సమాచారంతో మధుసాగర్, రాకేశ్‌లు గడ్డివాముల చాటున వేచిచూస్తున్నారు. శంకరయ్య తన కూతురు అర్చనను సైకిల్‌పై తీసుకెళ్తుండగా వెంబడించారు. ఆ సమయంలో మధుసాగర్ తన చేతిలో ఉన్న కత్తితో శంకరయ్య తల వెనక భాగంలో నరికాడు. ఆయన మృతి చెందాడని నిర్ధారించుకున్నాక బైక్‌పై రాకేశ్‌తో కలిసి పారిపోయాడు. పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా మధుసాగర్, అతని బావ మహేశ్ మర్రిగడ్డ బస్టాండ్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితోపాటు రెండు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు రాకేశ్, మహేందర్‌ల కోసం వెతుకుతుండగా మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో మూడపల్లి బస్టాండ్‌లో పట్టుకొని, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని హత్యకు ప్రేరేపించినవారి పేర్లు తమ దృష్టికి వచ్చాయని, వారిలో కొందరు మహిళా సంఘాల సభ్యులున్నారని డీఎస్పీ తెలిపారు. విచారణ జరిపి, బైండోవర్ చేస్తామన్నారు. నలుగురు నిందితులనూ రిమాండ్‌కు పంపుతున్నట్లు పేర్కొన్నారు. చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్, ఎస్సై జిల్లెల్ల రమేశ్‌లు ఉన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్లఅర్బన్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలలోని సాంఘిక సంక్షేమ గురుకల పాఠశాలలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు బాల, బాలికలను సమానంగా చూడాలన్నారు. బాలికల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వెంకంపేటలోని పాఠశాలలో కరాటే శిక్షణ పొందిన బాలికలకు ధ్రువపత్రాలు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, కౌన్సిలర్ బొల్గం నాగరాజు, సీడీపీవోలు అలేఖ్యపటేల్, ఎల్లయ్యగౌడ్, డీసీపీవో స్వర్ణలత, పద్మజ, సఖీ సెంటర్ నిర్వాహకురాలు రోజా, ప్రిన్సిపాల్ జాక్వెలిన్, మల్లేశం ఉన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి(కరీంనగర్): మానకొండూర్ మండలం శ్రీనివాసనగర్‌కు చెందిన వరికొప్పుల సంపత్‌కు విద్యుత్ చౌర్యం కేసులో జిల్లా కోర్టు జైలు శిక్ష విధించినట్లు విద్యుత్ విజిలెన్స్ సీఐ కె.స్వామి తెలిపారు. విద్యుత్ సంస్థ నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ పట్టుబడ్డ సంపత్‌పై కేసు నమోదు చేయడంతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించి మొదటి నేరంగా వదిలిపెట్టడం జరిగిందన్నారు. అయినా పద్ధతి మార్చుకోని సంపత్ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ రెండవ సారి దొరకడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. కోర్టు చేపట్టే విచారణకు విధిగా హాజరుకావాలని ఆదేశిస్తూ అతడికి బెయిల్ మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి సంపత్ తప్పించుకు తిరుగుతుండగా మంగళవారం ఎస్సై నిరంజన్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రమేష్, రాజయ్య శ్రీనివాసనగర్‌లో అతన్ని పట్టుకొని కోర్టులో హాజరపర్చినట్లు తెలిపారు. విచారణ చేపట్టిన జిల్లా అదనపు ప్రధాన న్యాయమూర్తి, నిందితున్ని జైలుకు తరలిస్తూ ఆదేశాలిచ్చినట్లు సీఐ పేర్కొన్నారు.

కోర్టుకు హాజరైన ప్రతిపక్ష కౌన్సిలర్లు



కోర్టు ప్రాంగణంలో కౌన్సిలర్లు

జగిత్యాలజోన్: జగిత్యాల మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు కల్లెపల్లి దుర్గయ్య, నక్క జీవన్ కుమార్, ములాస్తం లలిత, ఇండిపెండెంట్ కౌన్సిలర్ అనుమండ్ల జయశ్రీలు మంగళవారం జగిత్యాల కోర్టుకు హాజరయ్యారు. 19 జూన్ 2020న జరిగిన మున్సిపల్ సమావేశంలో ఎజెండాను చదవకుండానే పాస్ చేయడంతో ప్రతిపక్ష కౌన్సిలర్లు మున్సిపల్ గేటు ఎదుట నిరసన తెలిపారు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి సమన్లు జారీ అవడంతో కోర్టుకు వచ్చారు. వీరికి మద్దతుగా గాజుల రాజేందర్, బండ శంకర్, అనుమండ్ల రఘులు హాజరయ్యారు. అధికార పార్టీ సభ్యులు తమపై లేనిపోని ఆరోపణలు చేసి, కేసు నమోదు చేయించారని ఆరోపించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ నిరసన

- అధికారులను అడిగితే ఇబ్బందికరంగా మాట్లాడుతున్నారు..
- మంగేళ గ్రామ మాజీ సర్పంచ్ భర్త ఆవేదన



కార్యాలయంలో పడుకొని నిరసన తెలుపుతున్న శంకర్

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామ మాజీ సర్పంచ్ భర్త బనుక శంకర్ మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిరసన తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం.. మంగేళ గ్రామ సర్పంచ్‌గా శంకర్ భార్య పద్మ 2013–14 నుంచి ఐదేళ్లు బాధ్యతలు నిర్వహించారు. పదవీకాలం ముగింపు సమయంలో, ఆ తర్వాత వచ్చిన ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామంలో బోర్ల ఏర్పాటు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన బిల్లులు రూ.55,100 రావాల్సి ఉంది. దీనికి సంబంధించిన చెక్కును అప్పటి ప్రత్యేకాధికారి, సంబంధిత పంచాయతీ కార్యదర్శి 2019 జనవరి 28న అందించారు. దీంతోపాటు పద్మ పదవీకాలంలో కొన్ని నెలల వేతనం రావాలి. ఈ డబ్బులు గ్రామ పంచాయతీ నుంచి చెల్లించాల్సి ఉంది. అడిగితే మండల పరిషత్ కార్యాలయంలోని ఓ అధికారి, మంగేళ పంచాయతీలోనూ తనతో ఇబ్బందికరంగా మాట్లాడుతున్నారని శంకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు డబ్బులు ఇప్పించాలంటూ మండల పరిషత్ కార్యాలయ ద్వారానికి అడ్డుగా పడుకొని, నిరసన తెలిపాడు. ఈ విషయమై కలెక్టర్ రవి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌లను కలవనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వలస కార్మికుడి మృతి



ముకుల్ మహతో మృతదేహం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులోని ప్రైవేట్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న వలస కార్మికుడు ముకుల్ మహతో(45) నివాస క్యాంపులో మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. ఢిల్లీకి చెందిన ముకుల్ మహతో బ్యాగింగ్ ఇండియా లిమిటెడ్‌లో పని చేస్తున్నాడు. అతడు నివాసం ఉంటున్న క్యాంపులోని గదిలో సోమవారం రాత్రి స్పృహ లేకుండా ఉన్న సమయంలో క్యాంపు సేఫ్టీ ఆఫీసర్ ఆంటోని ప్రాజెక్టు మేనేజర్ రామస్వామికి సమాచారం అందించారు. ముకుల్‌ను చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మంగళవారం ఉదయం మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా వారు మాట్లాడారు. ముకుల్‌కు అప్పుడప్పుడు ఛాతిలో నొప్పి వస్తుందని, దానితోనే మృతిచెంది ఉంటాడని, అతడి మృతిపై అనుమానాలు లేవని తెలిపారు. ఢిల్లీ నుంచి ఇక్కడికి వచ్చే స్తోమత లేదని పేర్కొన్నారు. ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేసి మృతదేహాన్ని ఢిల్లీకి పంపించాలని కోరినట్లు రామస్వామి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్ పేర్కొన్నారు.

బడి మానేసి భిక్షాటన



ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న బాలికలు

వేములవాడ: పదుల సంఖ్యలో బాలికలు బడి మానేసి, రాజన్న ఆలయం ఎదుట భిక్షాటన చేస్తూ భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అధికారుల కళ్లముందే ఇదంతా జరుగుతున్నారు వారు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆలయ ఈవో కార్యాలయం ముందు నుంచి రాజేశ్వరపురం వైపు వెళ్లే దారిలో వీరంతా గుంపులుగా వస్తున్నారని అంటున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో బాలికలు చదువు మానేసి, భిక్షాటన చేస్తున్నారని స్థానికులు తెలిపారు. బంగారు భవిష్యత్తు కలిగిన వారిని ఇలా గుడి ఆవరణలో భిక్షాటనకు అనుమతించడం సరికాదని అంటున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి, వారు పాఠశాలలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లబొప్పాపూర్ శివారు పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. ఓ రహస్య ప్రదేశంలో పేకాడుతున్నట్లు ఎస్పీ రాహుల్‌హెగ్డేకు సమాచారం అందింది. ఆయన సీసీఎస్ పోలీసులను అప్రమత్తం చేయడంతో అక్కడికి చేరుకున్నారు. పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1.55 లక్షలు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. నిందితులు ఎవరనే వివరాలు చెప్పేందుకు పోలీసులు నిరాకరించారు.